సాక్షి ఒడిశా
బుధవారం । 1 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,71,674లు, బంగారం 81 గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 222 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రైల్వేకు కొత్త టైమ్‌టేబుల్

రైల్వే కొత్త టైమ్ టేబుల్ నేటి నుంచి అమలు కానుంది. రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు వచ్చాయి. - IIలో▸



మీతో నేను ఉంటా

మాజీ సీఎం నవీన్ పట్నాయక్ రైతులను కలుస్తున్నారు. నష్టపోయిన వారికి అండగా ఉంటానని భరోసా ఇస్తున్నారు. - IIలో▸

శ్రీక్షేత్రం కిటకిట

- నూతన ఏడాది సందర్భంగా పెద్ద ఎత్తున భక్తుల రాక
- రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు

భువనేశ్వర్: ఆంగ్ల సంవత్సరాది అంతిమ వేళలో శ్రీజగన్నాథుని దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తుల తాకిడితో శ్రీ క్షేత్రం కిటకిటలాడుతుంది. దర్శనం కోసం గంటల తరబడి బారులు తీరాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తోపులాట వంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా రద్దీ నియంత్రణ కోసం పూరీ జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. సులభ దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు, కలెక్టరు ఈ ఏర్పాట్ల నిర్వహణ తరచు సమీక్షిస్తున్నారు. ప్రధానంగా వరుస క్రమంలో దర్శనం కోసం భక్తుల్ని అనుమతించేందుకు తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేశారు. బొడొ దండొ మార్గంలో మార్కెటు కూడలి నుంచి శ్రీమందిరం సింహ ద్వారం ఆవరణ వరకు ఈ సౌకర్యం కల్పించారు. రెండు రోజులపాటు ఈప్రాంతం నో వెహికిల్ జోన్‌గా ప్రకటించారు. శ్రీ మందిరం లోనికి భక్తులు ప్రవేశం, బయటకు వచ్చే ద్వారాల ప్రాంగణాల్లో తొక్కిసలాట నివారణకు ప్రత్యేక బృందాల్ని నియమించారు. శ్రీ మందిరం వద్ద రద్దీని నియంత్రించేందుకు సీనియర్ పోలీసు అధికారులను మోహరించారు. ఈ వ్యవస్థ బుధవారం వరకు నిరవధికంగా కొనసాగుతుంది. పూరీ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 30 పైబడి తాగునీటి సౌకర్యాలు కల్పించారు. ఆకస్మిక అనారోగ్య పరిస్థితుల నిర్వహణ కోసం ప్రాణ రక్షణ ఔషధాలతో అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉంచినట్లు శ్రీ జగన్నాథ ఆలయం అధికార వర్గాలు తెలిపాయి.



మార్కెట్ కూడలి నుంచి ఏర్పాటు చేసిన బారికేడ్లు



స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



అధికారుల సమీక్ష సమావేశం

న్యూస్‌రీల్

60 వేల గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాయగడ: గంజాయి సాగుపై ఉక్కు పాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం కొద్ది నెలలుగా విస్తృతంగా దాడులను నిర్వహిస్తుంది. ఈ క్రమంలో జిల్లాలోని పద్మపూర్ సమితి నువాగడ పంచాయతీ పరిధిలోని మహాదిమ్ ప్రాంతంలో అక్రమంగా గంజాయి సాగవుతుందన్న సమాచారం మేరకు సామవారం పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో 20 ఎకరాల విస్తీర్ణంలో 60 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి ఈ మేరకు కేసు నమోదు చేశారు.

బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం



లక్ష్మీ బస్సు

రాయగడ: రాయగడ నుంచి కెరడ వైపు వెళుతున్న లక్ష్మీ బస్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం రాయగడ నుంచి సుమారు 40 మంది ప్రయాణికులతో కెరడ వైపు వెళుతున్న బస్సు లడ్డ సమీపంలో ముందు చక్రం ఒక్కసారిగా వేరైపాయింది. దీంతో బస్సును అతి చాకచక్యంతొ డ్రైవర్ కృష్ణ నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు సురక్షితంగా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సుకు నిర్వహణ లోపంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని సమాచారం.

నేటి నుంచి విమానయానం విస్తృతం



భువనేశ్వర్: ఆంగ్ల సంవత్సరాది మొదలుకొని రాష్ట్రంలో కొత్త గమ్య స్థానాలకు విమానయాన సౌకర్యాలు విస్తృతపరుస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. ఈ విస్తరణ రాష్ట్ర ఆర్థిక రంగం పురోగతికి దోహదపడుతుంది. జనవరి నెల 1 నుంచి ఈ సౌకర్యాలు అంచెలంచెలుగా ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. బుధవారం నుంచి ఝార్సుగుడ విమానాశ్రయం నుంచి 4 నగరాలకు విమానయాన సౌకర్యం ఆరంభం అవుతుంది. హైదరాబాద్, రాయపూర్, లక్నో, ముంబై నగరాలకు ఝార్సుగుడ నుంచి విమానయానం సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఈ నెల 3వ తేదీ నుంచి భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొత్త 5 గమ్య స్థానాలకు విమానయాన సేవలు కల్పిస్తున్నారు. ఈ జాబితాలో ఇండోర్, డెహ్రాడూన్, కోచి, జైపూర్, లక్నో నగరాలు ఉన్నాయి.

న్యూ ఇయర్ వేడుకలకు దూరం

భువనేశ్వర్: కొత్త ఆంగ్ల సంవత్సరం 2025 వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, శాసన సభ విపక్ష నేత నవీన్ పట్నాయక్ మంగళవారం ప్రకటించారు. అకాల వర్షాలతో పంట నీట మునిగి రైతులు దిగాలు చెందుతున్నారని, అలాగే మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాప సూచకంగా ఈ ఏడాది న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు.

లింక్ ఫెయిల్



పోస్టాఫీసులో పెట్టిన లింక్ ఫెయిల్డ్ అన్న బోర్డులు

జయపురం: జయపురం పోస్టాఫీసులో మూడు దినాలుగా లింక్ లేక పనులు స్తంభించిపోయాయి. మూడు రోజులుగా పోస్టాఫీసు తెరుస్తున్నా పనులు మాత్రం జరగడం లేదు. పోస్టాఫీసు కౌంటర్లలో లింక్ ఫెయిల్డ్ బోర్డుల కనిపిస్తున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

పొద్దు తిరుగుడు సాగుపై రైతులకు అవగాహన



రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన అధికారులు

రాయగడ: తక్కువ పెట్టుబడి అధిక దిగుబడినిచ్చి రైతుల ఆర్థిక పురోగతికి దోహదపడే పొద్దు తిరుగుడు పువ్వుసాగుపై రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తుంది. రాయగడ జిల్లాలోని మునిగుడలో 2025–26 రవీ సీజన్‌లో రైతులకు ఈ సాగుపై ఆసక్తి కనబరిచేలా అధికారులు సన్నహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మునిగుడ వ్యవసాయ శాఖ అధికారి నిరంజన్ సతపతి, సమితి వ్యవసాయ శాఖ అధికారి దీప్తి రాణి పట్నాయక్ తదితరులు మంగళవారం రైతులకు పొద్దు తిరుగుడు సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు మేలు రకమైన విత్తనాలను పంపిణీ చేశారు. రబీ సాగులో భాగంగా పొద్దు తిరుగుడును అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించారు. సమితిలో ఈసారి సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో పొద్దు తిరుగుడు సాగు చేసే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సతపతి తెలియజేశారు. అందుకు ఇప్పటి నుంచే రైతులకు ఈ పంటపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

నగర డీసీపీ పినాక్ మిశ్రాకు పదోన్నతి



పినాక్ మిశ్రాకు

భువనేశ్వర్: నగర డీసీపీ పినాక్ మిశ్రాకు పదోన్నతి లభించింది. రాష్ట్రంలోని 8 మంది ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు లభించిన వారిలో ఆయన ఒకరు. తాజా పదోన్నతి ఉత్తర్వుల ప్రకారం 2000 సంవత్సరపు బ్యాచ్ ఐపీఎస్ అధికారులు యతేంద్ర కోయల్, కేంద్ర డిప్యుటేషన్‌లో ఉన్న ప్రతీక్ మహంతి అదనపు డైరెక్టరు జనరల్ స్థాయికి పదోన్నతి పొందారు. ప్రస్తుతం ప్రతీక్ మహంతి సీఐఎస్ఎఫ్ (హెడ్ క్వార్టర్స్)లో ఐజీగా పని చేస్తున్నారు. 2007 సంవత్సరపు బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు అవినాష్ కుమార్, సార్థక్ షడంగి, నీతి శేఖర్‌లు ఇనస్పెక్టరు జనరలుగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం భువనేశ్వర్ డీసీపీగా ఉన్న 2011 సంవత్సరపు బ్యాచ్ ఐపీఎస్ అధికారి పినాక్ మిశ్రా డీఐజీగా పదోన్నతి పొందారు. ఈ బ్యాచ్‌కు చెందిన మరో 2 మంది ఐపీఎస్ అధికారులు బి.యుగళ కిషోర్ కుమార్, బి.గంగాధర్ డీఐజీగా పదోన్నతి పొందారు.

మర్డర్ కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జితేంద్ర కుమార్ పండా

- నలుగురు నిందితులు అరెస్టు

పర్లాకిమిడి: పట్టణంలో సంచలనం సృష్టించిన కృష్ణచంద్ర పండా మర్డర్ కేసును ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారులు ఛేదించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లా కంకిపాడులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 25వ తేదీన స్థానిక కొత్త కాపువీధికి చెందిన కృష్ణచంద్ర పండా మృతదేహం ఆంధ్రా– ఒడిశా సరిహద్దు సీతాసాగరంలో ఒక గోనె సంచెలో దొరికిన విషయం తెలిసిందే. దీనిపై మృతుడి కుమారుడు సంతోష్ పండా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదర్శపోలీసు స్టేషన్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. జంగం వీధిలో రాజ్యలక్ష్మి క్లినిక్ కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న మరియాల దుర్యోధన, సహచరులు కలిసి కృష్ణచంద్ర పండాను కొట్టిచంపి ఒక గోనె సంచెలో పెట్టి ఆటోలో తీసుకొచ్చి సీతాసాగరంలో పారవేశారు. అనంతరం అక్కడినుంచి పారిపోయారు. పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా దర్యాప్తు చేసి చివరకు ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా కంకిపాడు చేపల మార్కెట్‌లో నిందితులు నలుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో మరియాల దుర్యోధన్, అరుణ్ లిమ్మా, తారాసాయి మహేష్, మరియాల మల్లి ఉన్నారు. వీరందరూ పర్లాకిమిడి జగ్గిలి వీధికి చెందినవారు.

అసభ్యంగా ప్రవర్తించడంతో...

మృతుడు కృష్ణచంద్ర పండా, మల్లికి ఇదివరకే పరిచయం ఉంది. ఇటీవలే మరియాల దుర్యోధనతో ఆమెకు వివాహం జరిగింది. అయితే డిసెంబర్ 25న జంగంవీధి రాజ్యలక్ష్మి క్లినిక్‌లో నివాసం ఉంటున్న మరియాల మల్లి వద్దకు కృష్ణచంద్ర పండా వెళ్లాడు. అయితే ఆ సమయంలో ఆమె భర్త లేకపోవడంతో మల్లితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఏడుస్తూ కూర్చుంది. ఇంతలో ఆమె భర్త మరియాల దుర్యోధన వచ్చి విషయం తెలుసుకొని కృష్ణచంద్ర పండాను కొట్టాడు. దీంతో స్పృహ కోల్పోయిన పండా మృతి చెందాడు, అనంతరం పండా మృతదేహాన్ని గోనె సంచెలో కట్టి ఆ రాత్రికే కాంప్లెక్స్ నుంచి తన బంధువుల సాయంతో తరలించాలని పథకం వేశాడు. అనుకున్నట్టుగానే ఒక ఆటోలో సీతా సాగరంకు తరలించి శవాన్ని హత్య జరిగిన రాత్రి విసిరివేశాడు. తదనంతరం పోలీసుల దర్యాప్తులో జంగంవీధి సీసీ టీవీల సాయంతో నిందితులు పట్టుబడ్డారు. కేసులో ఇంకా ఎవరెవరు నిందితులు ఉన్నా పట్టుకుని అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా పేర్కొన్నారు. సమావేశంలో ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

అఖిల ఒడిశా లాయర్స్ అసోసియేషన్ ఎడిటర్‌గా గాయత్రిదేవి



డాక్టర్ గాయత్రీ దేవిని సన్మానిస్తున్న రాష్ట్ర బార్ అసోసియేషన్ ప్రతినిధులు

జయపురం: జయపురం జిల్లా బార్ అసోసియేషన్ సభ్యురాలు, జయపురం స్పెషల్ పోక్సో కోర్టు ప్రభుత్వ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ బి.గాయిత్రీ దేవిని అఖిల ఒడిశా లాయర్స్ అసోసియేషన్ ఎడిటర్‌గా నియమించారు. ఈ నెల 29,30 తేదీల్లో మల్కన్‌గిరి అఖిల ఒడిశా లాయర్స్ అసోసియేషన్ 53వ కన్వెన్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రీ దేవి సేవలను వక్తలు కొనియాడారు. ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేషన్‌కు ఎడిటర్‌గా నియమించి గౌరవించింది.

ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు



పూరీ సాగర తీరంలో మానస కుమార్ సాహు ఆవిష్కరించిన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షల సైకత శిల్పం

భువనేశ్వర్: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సైకత యానిమేటరుగా పేరొందిన మానస కుమార్ సాహు అపురూపమైన శిల్పం ఆవిష్కరించాడు. పూరీ సాగర తీరంలో ఈ శిల్పం సందర్శకులు, పర్యాటకుల్ని ఆకట్టుకుంటోంది.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



శ్రీజగన్నాథునికి క్యాలెండర్ సమర్పించి పూజలు చేసిన బ్రాహ్మణ సమాజ్ సభ్యులు



మందిరాల సముదాయంలో క్యాలెండర్లతో బ్రాహ్మణ సమాజ్ సభ్యులు

జయపురం: కొరాపుట్ జిల్లా బ్రాహ్మణ సమాజ్ జయపురం వారు నూతన క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక శ్రీజగన్నాథ్ మందిరంలో ఆవిష్కరించారు. ముందుగా ఉత్కళుల ఆరాధ్య దైవం శ్రీజగన్నాథునికి పూజలు చేశారు. ఆలయాల సముదాయ కూడలి వద్ద 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో కొరాపుట్ బ్రాహ్మణ సమాజ్ సభ్యులు నరసింహ ప్రసాద్ మిశ్ర, శరత్ చంద్ర బినోద్ మహాపాత్రో, రమేష్ త్రిపాఠీ, కిశోర్ పండ, బిజయ భట్,భవాని ఆచార్య, సన చౌదురి,ముధి హొత్త,నవకృష్ణ రథ్, లతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూ పట్టాల పంపిణీ



పట్టాదారులతో అధికారులు

రాయగడ: పట్టణంలోని మునిగుడ తహసీల్ పరిధి కాంబేసు గ్రామంలో 9 మంది నిరుపేదలకు జంగల్, జొమ్మి పథకంలో భాగంగా భూపట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహొట ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జాలరి వలలో దేవుళ్ల విగ్రహాలు



జాలరి వలలో చిక్కిన శనీశ్వరుని విగ్రహం



మత్స్యకారుని వలకు చిక్కిన హనుమంతుని విగ్రహం

భువనేశ్వర్: మహానదిలో దేవుళ్ల విగ్రహాలు వెలుగు చూశాయి. చేపల వేట కోసం పన్నిన మత్స్యకారుని వలలో ఈ విగ్రహాలు చిక్కుకున్నాయి. వల తీరం చేరిన తర్వాత పరిశీలించడంతో దేవుళ్ల విగ్రహాలను గుర్తించారు. వీటిలో హనుమంతుడు, శనీశ్వరుడు విగ్రహాలు ఉన్నట్లు గుర్తించారు. వీటి ఎత్తు సుమారు 4 అడుగులుగా గుర్తించారు. ఇవి అత్యంత పురాతనమైనవిగా భావిస్తున్నారు. నయాగఢ్ జిల్లా భాపూర్ మండలం పద్మాబతి గ్రామం సమీపంలో ఈ ఘటన వెలుగు చూసింది. స్థానిక జగన్నాథ దేవాలయంలో వీటిని భద్రపరిచారు. ఈ తీరంలో పురాతన విగ్రహాలు నదీ గర్భం నుంచి బయటపడడం కొత్తేమీ కాదు. తాజాగా విగ్రహాలు బయటపడడం చర్చనీయాంశమైంది. సుమారు 4 ఏళ్ల కిందట 2020 సంవత్సరంలో నదిలో నీటిమట్టం తగ్గడంతో ఆలయ శిఖరం అంశాలు వెలుగులోకి రానే వచ్చాయి. ఈ భగ్నాంశాలు 500 ఏళ్ల నాటి ప్రాచీన ఆలయం శిఖరంగా ప్రాథమిక సమాచారం.

సర్వేబృందం పరిశీలన

ది ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) సర్వే బృందం పరిశీలించి ఆలయ శిఖరం భగ్న అంశాల నిర్మాణ శైలి మరియు నిర్మాణ సామగ్రి ఆధారంగా, 60 అడుగుల ఆలయం, గోపీనాథ్ ఆరాధ్య దైవ సన్నిధి శిఖర భాగంగా ప్రకటించారు. 15వ శతాబ్దం చివరి లేదా 16వ శతాబ్దం ప్రారంభంలో ఈ ఆలయం నిర్మితం అయి ఉంటుందని ఈ వర్గం అప్పట్లో పేర్కొంది. మరో సంఘటనలో గతేడాది డిసెంబర్‌లో ఇదే ప్రాంతంలో స్థానికులు నదిలో స్నానం చేస్తుండగా ఎనిమిది పురాతన లోహపు నాగుల విగ్రహాలు బయటపడ్డాయి. మహానది పద్మాబతి తీరం పరిసరాల్లో దాదాపు 16 ఆలయాలు నీట మునిగినట్లు పాత దస్తావేజుల సమాచారంగా ఇంటాక్ పేర్కొంది. వీటి ఆధారంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో వైపు మహానది లోయ వారసత్వపు డాక్యుమెంటేషన్‌పై ఒక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. దీనిలో మునిగిపోయిన గోపీనాథ్ దేవాలయం విషయాన్ని ప్రస్తావించింది.

క్లుప్తంగా

రాహుల్‌కు వడ్డాది పాపయ్య పురస్కారం



వపా స్మారక పురస్కారంతో రాహుల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్‌: అరసవల్లికి చెందిన చిత్రకారుడు రాహుల్‌ పట్నాయిక్‌ వడ్డాది పాపయ్య స్మారక పురస్కారం అందుకున్నారు. విశాఖకు చెందిన చిత్రకళాపరిషత్‌ ఆధ్వర్యంలోకంచరపాలెం బీఎస్‌ఆర్‌ భవనంలో ఆదివారం ఈ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఒకే చట్రంలో వడ్డాది పాపయ్య గీసిన వంద చిత్రాలను సూక్ష్మీకరించి అందంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో వపా వర్ధంతిని పురస్కరించుకొని ఆయన లోగోతో ఉన్న రజత ఉంగరాన్ని నిర్వాహకులు బహూకరించారు. కార్యక్రమంలో చిత్రకళాపరిషత్‌ కార్యదర్శి సుంకరి చలపతిరావు, బీఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ కార్యదర్శి బి.ఆర్‌.జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులకు రిమాండ్‌

శ్రీకాకుళం క్రైమ్‌: జిల్లా కేంద్రంలోని టౌన్‌ హాల్‌ సమీపంలో బహిరంగంగా మద్యం తాగి అలజడి సృష్టించిన యువకులకు 20 రోజుల పాటు కోర్టు రిమాండ్‌ విధించిందని ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. సల్మాన్‌ఖాన్‌, కుందు ఎర్రయ్య అనే యువకులు మద్యం మత్తులో ఓ వృద్ధురాలిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి అలజడి సృష్టించి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే ఇలానే కేసులు నమోదు చేసి జైలుకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

దోపిడీ దొంగలు అరెస్టు

సారవకోట: మండలంలోని నౌతళ ఘాట్‌ రోడ్డులో డిసెంబర్‌ 26న జరిగిన దోపిడీ ఘటనను సారవకోట పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు మంగళవారం వివరాలు వెల్లడించారు. డిసెంబర్‌ 26న అంగూరు పంచాయతీ అడ్డపనస గ్రామానికి చెందిన కరగాన రాజు తన బొలేరో వాహనంలో పాతపట్నం వైపు నుంచి సారవకోట వైపు వస్తుండగా రాత్రి 10.30 గంటల సమయంలో నౌతళ ఘాట్‌ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని ఆపారు. దాడి చేసి అతని వద్ద రూ.66 వేలు, మొబైల్‌ ఫోన్‌ దోచుకుని పరారయ్యారు. బాధితులు సోమవారం సారవకోట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం నరసన్నపేట మండలం టెక్కలిపాడు జంక్షన్‌ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశా రాష్ట్రం బడోకుసిమికి చెందిన కేశభగౌడ్‌, చంద్రపూర్‌ గ్రామానికి చెందిన హృషికేశ్‌ స్వరగూల్‌ అలియాస్‌ పుష్పను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా తామే దోపిడీ చేసినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.63 వేలు నగదు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

28 ధాన్యం బస్తాలు చోరీ

బూర్జ: మండలంలో తోటవాడలో గేదెల జోగి నాయుడుకి చెందిన 28 బస్తాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు బూర్జ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొమ్మువలస, నరేంద్రపురం గ్రామాల సమీపంలో వ్యవసాయ భూమిలో ఆదివారం నూర్పు చేసి 53 బస్తాలను నిల్వ చేసి ఉంచారు. మంగళవారం లోడ్‌ చేయడానికి వ్యాను తీసుకెళ్లగా 28 బస్తాలు కనిపించలేదు. ఈ మేరకు బాధిత రైతుల పోలీసులను ఆశ్రయించారు.

నేడు అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు

శ్రీకాకుళం క్రైమ్‌ : నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా బుధవారం రాత్రి 12 గంటల వరకు జిల్లా కేంద్రంలో మద్యం దుకాణాలు తెరిచే ఉంటాయని, బార్‌ అండ్‌ రెస్టారెంట్లు ఒంటిగంట వరకు ఉంటాయని ఎక్సైజ్‌ సీఐ ఎం.వి.గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు

అరసవల్లి: ఫిబ్రవరి 4న జరగనున్న రథసప్తమి ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందని, ఈ మేరకు ఏర్పాట్లు అంతేస్థాయిలో జరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ అధికారులను ఆదేశించారు. భార్య గొండు స్వాతితో కలిసి మంగళవారం ఆదిత్యుని దర్శించుకున్నారు. అన్నదాన ప్రసాదం స్వీకరించి రథసప్తమి ఏర్పాట్లపై ఆలయ అధికారులతో సమీక్షించారు. వీఐపీ మార్గంలో ఇష్టారాజ్యంగా ప్రవేశాలు జరగకుండా బందోబస్తు చేస్తున్నట్లు ప్రకటించారు. సమగ్రమైన రూట్‌ మ్యాప్‌లు సిద్ధం చేయాలని ఈవో వై.భద్రాజీని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, టీడీపీ నాయకులు ఉంగటి రమణమూర్తి, తెలుగు నాగరత్నం, ఉంగటి పాపారావు, రాయపల్లి అర్జున్‌ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

రణస్థలం: యువత నూతన సంవత్సర వేడుకల పేరుతో కేక్‌లు కత్తిరించే బదులు మొక్కనాటితే పర్యావరణానికి మేలు చేకూర్చేవారవుతారని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్‌ ఆర్‌.హరిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలకు వేప, కాగు, తురాయి, బాదం, గంగరావి, బూరుగు, నిద్రగన్నేరు, మామిడి, జామ వంటి మొక్కలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు.

న్యూఇయర్‌ కేకులతో సందడి



పర్లాకిమిడి మార్కెట్‌లో వివిధ రకాల కేకులు



ఇండియన్‌ క్రికెట్‌ జట్టు కెప్టెన్‌ రోహిత్‌ శర్మ కేక్‌

పర్లాకిమిడి: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా పర్లాకిమిడిలో కేక్‌ల దుకాణాలు వెలిశాయి. వివిధ ఆకారంలో కేక్‌లను తయారు చేసి వ్యాపారులు విక్రయానికి ఉంచారు. రూ.150 నుంచి రెండు వేల రూపాయల వరకూ కేక్‌ ధరలు పలుకుతున్నాయి.

కొత్త సంవత్సరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్‌ పండా తెలిపారు.



రూ.1500 ఖరీదుచేసే వన్యమృగం కేక్‌



కేకులు ధరల్లో దేనికదే సాటి

ముగిసిన బార్‌ అసోసియేషన్‌ వేడుకలు



చిన్నారి సంబల్‌పూరి నృత్యం



వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరిలో మూడు రోజులు నిర్వహించిన రాష్ట్ర స్థాయి 53వ లాయర్స్‌ అసోసియేషన్‌ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున స్థానిక డీఎన్‌కే క్రీడా మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆధిత్యా కుమార్‌ మహాపాత్రో, రాష్ట్ర బార్‌కౌన్సిల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి అభిత్‌ కుమార్‌ త్రిపాఠి, బార్‌ కౌన్సిల్‌ సభ్యులు బిబు ప్రసాద్‌ త్రిపాఠి, రమేష్‌ పాత్రో, నవరంగ్‌పూర్‌ సంఘం అధ్యక్షుడు నరసింహ త్రిపాఠి, రాయగాడ సంఘం అధ్యక్షుడు పద్మానాబ్‌ నాస్‌, జయపురం సంఘం అధ్యక్షుడు మున్నా సింగ్‌ పాల్గొన్నారు. ఈ సందర్బంగా కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన ఆహూతులను అలరించాయి. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆధిత్యా కుమార్‌ మహాపాత్రో మాట్లాడుతూ.. మల్కన్‌గిరి చరిత్రను వివరించారు. ఆక్కడ అమాయక గిరిజనులు, ఇక్కడ అమాయక ప్రజలకు న్యాయం జరగాలన్నారు. ప్రజలకుకు న్యాయం ఎలా చేయాలో న్యాయవాదులకు వివరించారు. మల్కన్‌గిరి సంఘ అధ్యక్షుడు నరసింహ చరణ్‌ ఆధ్వర్యంలో అతిథులు, పత్రికా ప్రతినిధులు, ముఖ్యనాయకులు, న్యాయవాదులను సన్మానించారు.



యాంకర్ల సందడి



కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన



ఒడిస్సీ నృత్యంలో చిన్నారి



బిహు నృత్యంలో విద్యార్థులు

నేటి నుంచి రైల్వే కొత్త టైమ్‌ టేబుల్‌ అమలు

భువనేశ్వర్‌: భారతీయ రైల్వే కొత్త టైమ్‌ టేబుల్‌ నేటి నుంచి అమలు కానుంది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా రైళ్ల రాకపోకల వేళల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. రైళ్ల కొత్త వేళల తాజా వివరాలు రైల్వే శాఖ అనుబంధ పోర్టలులో లభ్యం అవుతాయి. సవరించిన టైమ్‌ టేబుల్‌ – 2025 ప్రకారం ఆగ్నేయ రైల్వే నుంచి బయల్దేరి తూర్పు కోస్తా రైల్వే గుండా దక్షిణాది ప్రాంతాలకు రాకపోకలు చేసే ప్రధాన ప్రయాణికుల రైళ్ల వేళల్లో మార్పుల వివరాలు.

రైలు నంబరు	నుంచి	వరకు	పాత వేళ	కొత్త సమయం
22873	దిఘా	విశాఖపట్నం	17.25	17.05
22889	దిఘా	పూరీ	17.25	17.05
15721	దిఘా	న్యూజలపాయిగుడి	17.25	17.05
22853	షాలిమార్‌	విశాఖపట్నం	18.25	18.15
18409	షాలిమార్‌	పూరీ	19.05	18.55
12887	షాలిమార్‌	పూరీ	20.40	20.35
12881	షాలిమార్‌	పూరీ	20.40	20.35
22835	షాలిమార్‌	పూరీ	20.40	20.35
12895	షాలిమార్‌	పూరీ	20.40	20.35
22803	షాలిమార్‌	సంబలపూర్‌	20.40	20.35
20831	షాలిమార్‌	సంబలపూర్‌	21.25	21.20
18005	హౌరా	జగదల్‌పూర్‌	22.20	22.10
12863	హౌరా	యశ్వంతపూర్‌	22.50	22.45
22642	షాలిమార్‌	తిరువనంతపురం	23.50	23.45
12660	షాలిమార్‌	తిరువనంతపురం	23.50	23.45
12839	హౌరా	ఎమ్‌జీఆర్‌ చెన్నై సెంట్రల్‌	23.55	23.45
22603	ఖరగపూర్‌	విల్లుపురం	14.10	14.00

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్‌ : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్‌, ఆర్టీసీ ఒకటో డిపో కార్యదర్శి ఎస్‌.వి.రమణడిమాండ్‌ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండవరోజైన మంగళవారం కూడా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఈయూ జోనల్‌ కమిటీ ఆదేశాల మేరకు 2019 జనవరి 1 సర్క్యులర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని, ఇటీవల సస్పెండ్‌ చేస్తూ వివిధ డిపోలకు ఇచ్చిన వారిని తిరిగి వెనక్కి రప్పించాలని, రన్నింగ్‌టైం సరిపోని రూట్‌లలో సర్వేలు జరిపి కచ్చితమైన రన్నింగ్‌ టైంలతో షెడ్యూల్‌ అమలు చేయాలని, వర్క్‌షాపులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, డ్రైవర్‌, కండక్టర్‌ డ్యూటీ చార్టులు అవసరమైన డిపోలలో తక్షణమే వేయాలని, ప్రతి డిపోలో రెస్టరూం సౌకర్యాలు కల్పించాలని, కొందరు అధికారులు, సూపర్‌వైజర్లు చేస్తున్న ఏకపక్షనిర్ణయాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు కె.బాబూరావు, కె.గోవిందరావు, బి.ఆనంద్‌, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

భువనేశ్వర్‌: పంట నష్టం తాళలేక జగత్‌సింగ్‌పూర్‌ జిల్లాలో రైతు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతుడు కృతిబాస్‌ స్వంయి కటుంబీకుల్ని విపక్ష నేత నవీన్‌ పట్నాయక్‌ పరామర్శించి సానుభూతి ప్రకటించారు.

పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు పరారీ?

ఎచ్చెర్ల క్యాంపస్‌: పలు దొంగతనాల్లో ప్రమేయం ఉన్నట్లు భావిస్తూ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్న నిందితుడు పరారైనట్లు తెలిసింది. మంగళవారం ఉదయం 7.30 గంటల సమీపంలో పోలీసుల కళ్లుగప్పి పారిపోయినట్లు సమాచారం. జిల్లాలో పలు ఇళ్లల్లో జరిగిన నేరాలకు ఈ వ్యక్తికి సంబంధం ఉన్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాంబాబుగా పోలీస్‌ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాళం వేసి ఉన్న ఇళ్లల్లో బంగారం, డబ్బు చోరీ చేస్తుంటాడు. ఇతన్ని మూడు రోజులుగా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. విచారణలో ఉండగా, పోలీస్‌ స్టేషన్‌ నుంచి పారిపోవడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. చాకచక్యంగా దొంగతనాలు చేయటం, బంగారం తాకట్టు పెట్టి మరో ప్రాంతానికి పారిపోవటం ఈ దొంగ ప్రత్యేకత. ప్రస్తుతం నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ముద్దాయికి జైలు శిక్ష

టెక్కలి రూరల్‌: మండలంలోని రాధావల్లభపురం గ్రామానికి చెందిన లండ లక్ష్మి అనే దళిత మహిళను అదే గ్రామానికి చెందిన సనపల ఢిల్లేశ్వరరావు కులం పేరుతో దూషించడంతో బాధితురాలు 2015లో టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్‌ఐ పి.నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ సెల్‌ డీఎస్పీ సీహెచ్‌ పెంటారావు దర్యాప్తు నిర్వహించారు. నేరం రుజువు కావడంతో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎస్‌ఎం ఫణికుమార్‌ ముద్దాయికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.11వేలు జరిమానా విధించారు.

విద్యార్థులకు కథల పోటీలు

టెక్కలి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'చిక్కోలు చిన్నోళ్లు' పేరిట కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు, అకడమిక్‌ విభాగం కన్వీనర్‌ పి.ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 26లోగా పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9493044470 నంబరును సంప్రదించాలని కోరారు.

పూరీ జిల్లా సత్యబాది ప్రాంతంలో నవీన్‌ పట్నాయక్‌కు ఆదరణతో స్వాగతం పలికిన బాధిత రైతులు



మీతో నేను ఉంటా



దెబ్బతిన్న పంటను నవీన్‌ పట్నాయక్‌కు ప్రదర్శించిన బాధిత రైతులు

- పంట నష్టం బాధితులకు నవీన్‌ భరోసా

భువనేశ్వర్‌: పంట నష్టం బాధితుల పక్షాన తాను నిలబడతానని విపక్ష నేత నవీన్‌ పట్నాయక్‌ అభయం ఇచ్చారు. ఆయన మంగళవారం జగత్‌సింగ్‌పూర్‌ జిల్లా సందర్శించి ప్రభావిత పంట పొలాల్లో పంట నష్టం తీవ్రతని ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధిత రైతాంగం గోడుని పరిగణనలోకి తీసుకుని విపక్ష హోదాలో బాధిత రైతాంగం కోసం ఉద్యమిస్తానని ప్రకటించారు. పీడిత రైతాంగానికి పంట నష్టం పరిహారం చెల్లించడంలో అవాంఛనీయ జాప్యం జరుగుతుంది. తమ ప్రభుత్వం తరహాలో పంట నష్ట పరిహారం తక్షణమే మంజూరు చేయాలని గుర్తుకు తెచ్చారు. రెండో రోజు పర్యటనలో భాగంగా జగత్‌సింగ్‌పూర్‌ జిల్లా బలికుదా మండలం సమీపం చందాహురా గ్రామం, పూరీ జిల్లా సత్యబాది సందర్శించారు. పంట నష్టంతో అల్లాడుతున్న రైతులను పరామర్శించి ఓదార్చారు.

ఈ సందర్భంగా పంట పొలాల్లో సాగు ఫలం దుస్థితిని పరిశీలించి బాధిత రైతాంగం నష్టాల గురించి స్థానిక రైతులతో చర్చలు జరిపారు. గంజాం జిల్లాలో కూడ పంట నష్టం తీవ్రత పట్ల విచారం వ్యక్తం చేశారు. పూరీ జిల్లా సత్యబాది ప్రాంతంలో నవీన్‌ పట్నాయక్‌ను స్థానికులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు.

ఖుర్దా రోడ్‌లో రైలు కోచ్‌ రెస్టారెంట్‌



రైలు కోచ్‌ రెస్టారెంటు ఇదే

భువనేశ్వర్‌: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్‌ రైల్వే స్టేషను ఆవరణలో సరికొత్త హంగులతో రైలు కోచ్‌ రెస్టారెంట్‌ స్వాగతం పలుకుతోంది. అందంగా రూపాంతరం చెందిన పాతకాలపు రైలు కోచ్‌ ప్రామాణికమైన ప్రాంతీయ రుచుల ఆస్వాదన కోసం ఆహ్వానిస్తోంది.

ఆంగ్ల సంవత్సరం కానుకగా ప్రయాణికులతో స్థానికులకు నోరూరించే రుచికరమైన తినుబండారాలు, పానీయాలు విశ్వసనీయ ధరలకు అందజేసేందుకు ముస్తాబైంది. రేపో మాపో ఈ రెస్టారెంటు సార్వత్రిక సేవలు ప్రారంభం అవుతాయి.



కాఫీ కౌంటర్‌



రైలు కోచ్‌ రెస్టారెంటులో సొబగులు

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో కానిస్టేబుల్‌ ఎంపికలో భాగంగా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు సెలవు దినాల్లో మినహా పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం 600 మందిని పిలిచి రాత్రి వరకు ఎంపికలు చేపట్టారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారిలో 45 శాతం గైర్హాజరవుతుండగా, హాజరైన వారిలో 70 శాతం వరకు ఈవెంట్స్‌లో అర్హత సాధిస్తున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అధికారులు ఎంపికలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, మంగళవారం 605 మంది అభ్యర్థులకు గాను 409 మంది హాజరయ్యారు. వీరిలో 205 మంది అర్హత సాధించారు.



అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రైతుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్‌ : జిల్లాలో ధాన్యం అమ్మేందుకు వెళ్తున్న రైతులు మిల్లర్ల నుంచి వేధింపులకు గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు బీన ఢిల్లీరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జాయింట్‌ కలెక్టర్‌ ఫర్మాన్‌ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. పలాస డివిజన్‌ పరిధిలో 10 కిలోల ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారని, ఇదేంటని రైతులు ప్రశ్నిస్తే ధాన్యం పట్టుకెళ్లిపోండని మిల్లర్లు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చౌదరి లక్ష్మణరావు, అమిరుల్లా బేగ్‌ పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి కౌశల్‌ పోటీల్లో ఢిల్లేశ్వరి ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరంలో ఎంజేపీఏపీబీసీఆర్‌డబ్ల్యూ బాలికల పాఠశాలకు చెందిన వండాన ఢిల్లేశ్వరి ప్రతిభ కనబర్చింది. విజయవాడలో భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్‌–2024 పోస్టర్‌ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచి పాఠశాల విద్య ఉన్నతాధికారులు, నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతి అందుకుంది. విద్యార్థినితో పాటు శిక్షణ ఇచ్చిన ఫిజిక్స్‌ టీచర్‌ చంద్రశేఖరుని కవిత, టీచర్లను, సిబ్బందిని ప్రిన్సిపాల్‌ గొలివి స్వరాజ్యలక్ష్మి మంగళవారం అభినందించారు.



బహుమతి అందుకుంటున్న వండాన ఢిల్లేశ్వరి

క్లుప్తంగా

మార్చిలో అందుబాటులోకి సీహెచ్‌సీ నూతన భవనం



భవన నిర్మాణంపై సీహెచ్‌సీ వైద్యాధికారితో మాట్లాడుతున్న డీఈఈ నరేంద్ర

బాడంగి: మండల కేంద్రంలో సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం మార్చి నెలాఖరు లోగా పూర్తి చేసి, అప్పగిస్తామని ఏపీఎంఎస్‌ఐ డీసీ డీఈఈ నరేంద్ర తెలిపారు. భవన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించిన ఆయన.. ప్రస్తుత సీహెచ్‌సీలో రోగులకు సరిపడ పడకలు లేకపోవడంతో రూ.8 కోట్ల నాబార్డు నిధులతో 50 పడకల ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు. అనంతరం వైద్యాధికారి నాగేశ్వరరావుతో ఆస్పత్రి భవన నిర్మాణం, సదుపాయాలపై చర్చించారు.

బీమా సదుపాయం సద్విని యోగం చేసుకోవాలి



రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

రాజాం సిటీ: బ్యాంకులు కల్పిస్తున్న బీమా సదుపాయాన్ని ఖాతాదారులంతా సద్విని యోగం చేసుకోవాలని పొగిరి ఏపీజీవీబీ బీఎం ఒమ్మి చంద్రరావు కోరారు. బ్యాంకు ద్వారా బీమా పొందిన ఇరువురికి చెక్కుల పంపిణీ బ్యాంకులో మంగళవారం చేశారు. అదే గ్రామానికి చెందిన కామోదుల అప్పలనారాయణమ్మ భర్త ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా, ఆయన ఏపీజీవీబీ ద్వారా ఎస్‌బీఐలో బీమా పాలసీ చేయించుకోవడంతో రూ.10 లక్షల చెక్కు అందించారు. అలాగే సాధారణ మరణం పొందిన పీఎంజేజేబీవై పాలసీదారు కుటుంబ సభ్యుడైన పప్పల గౌరీప్రసాద్‌కు రూ.2 లక్షల చెక్కు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా సదుపాయం పొందాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కె.అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చీపురుపల్లి: వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికుల సమస్య పరిష్కారమయ్యే వరకు కార్మికుల పోరాటం కొనసాగు తుందని సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, ఏ.గౌరు నాయుడు చెప్పారు. కర్లాంలోని పరిశ్రమ వద్ద సమ్మె చేస్తు న్న కార్మికులకు మంగళవారం వారు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2024 మే 31 నాటికే నూతన వేతన ఒప్పందం అమలు చేయాల్సిన యాజమాన్యం ఇంతవరకు చర్చల పేరుతో కాలయాపన చేసిందని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని నెల రోజుల క్రితమే కార్మికులు యాజమాన్యానికి నోటీసు ఇచ్చారన్నారు. ప్రశాంతంగా సమ్మె చేస్తున్న కార్మికులను భయాందోళనలకు గురిచేసేందుకు పరిశ్రమ యాజ మాన్యం పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను వినియోగించు కోవడం దారుణమన్నారు. పోలీస్‌స్టేషన్‌ల్లో ప్రజలకు సేవలందించాల్సిన పోలీసులు పరిశ్రమ వద్ద బందోబస్తు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు.

లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ పరం చేయవద్దు

బలిజిపేట: కూటమి ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆటో, మోటార్ రంగ కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకుడు మహేష్‌లు విమర్శించారు. ఈ మేరకు ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వం తీరుపై బలిజిపేటలో మంగళవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పడం వల్ల త మపై మరింత భారం పడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోటార్ వెహికల్ చట్ట సవరణలు చేసి ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం. ఆటో కొనుగోలుకు సబ్సిడీతో రూ.4లక్షలు ఇస్తాం. వాహనమిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.15వేలు అందిస్తాం. జీవో నంబర్ 21రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమలుచేయకుండా లేనిపోని విధానాలు అమలుపరిచి భారం మోపడం సమంజసంగా లేదన్నారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై తస్మాత్...

పూసపాటిరేగ: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా వుండాలని జిల్లా టీబీ ప్రత్యేక అధికారి డాక్టర్ వసుంధర అన్నారు. మంగళవారం గోవిందపురం, రెల్లివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేసారు. వైద్యాధికారి ఏపీ సుధారెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశల ఏడాదికి స్వాగత ఏర్పాట్లు

- ప్రారంభమైన న్యూ ఇయర్ సందడి
- కేకుల తయారీలో నిమగ్నమైన బేకరీ వ్యాపారులు
- వేడుకలకు సిద్ధమవుతున్న యువత



బేకరీలో తయారుచేస్తున్న కేకులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధం చేసిన కేకులు

బలిజిపేట: నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తుండడంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రకరకాల పూలు, బొకేల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఏదైనా వేడుక జరుపుకునేందుకు పిండి వంటల తయారీకి ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. ఇప్పుడు ఏ వేడుక అయినా కేక్ కట్‌చేసే సంప్రదాయానికి తెరలేచింది. దీంతో కేక్‌లు తయారుచేసేవారు అన్నింటికి ఒకే విధంగా కేక్ తయారుచేసే ప్రక్రియకు స్వస్తిపలికారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాలు, ఆకారాలతో సృజనాత్మకతకు పదునుపెట్టి కేకుల తయారీలో నిమగ్నమయ్యారు. న్యూఇయర్ వేడుకలకు వివిధ రకాల ఆకారాలు, డిజైన్లతో కేకుల తయారీ నిర్వహిస్తున్నారు. చాలావరకు క్రిస్మస్ ముందునుంచే కేకులకు ఆర్డర్లు పెరుగుతుంటాయి. వ్యాపారులు వారి వ్యాపారాన్ని అభివృద్ధి పరుచుకునేందుకు అడుగులు వేస్తున్నారు.

రుచిలోనూ మేటి:

ప్రస్తుతం కేకులు రుచిలోనూ మేటిగా మారాయి. వివిధ ఫ్లేవర్లలో అందుబాటులోకి వచ్చాయి. కూల్ కేకులు అందుబాటులోకి వచ్చి వినియోగదారులను ఆహా ఏమిరుచి అనిపిస్తున్నాయి. కేకుల తయారీలో కోడిగుడ్డు వినియోగం తప్పనిసరి. దీనివల్ల కొంతమంది గుడ్డును తినడానికి ఇష్టపడక కేకు తినేందుకు దూరంగా ఉంటారు. అందునిమిత్తం నాన్‌విజ్ తినే వారికోసం ఎగ్‌లెస్ కేకులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

వినియోగదారుని అభిరుచి మేరకే

కేకులను మార్కెట్‌కు అనుగుణంగా, వినియోగదారుని అభిరుచి మేరకే తయారుచేస్తున్నాం. దీని తయారీలో వివిద రకాల ఆకారాలు, డిజైన్లతో తయారుచేస్తాం. కేకులలో సాధారణమైనవి, కూల్‌కేక్‌లు తయారుచేస్తాం.

ఆర్.రమణమూర్తి, బేకరీ యజమాని, బలిజిపేట

నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సిద్ధం



పట్టణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పూలబొకేలు

సాలూరు: నూతన సంవత్సరానికి తమదైన శైలిలో స్వాగతం పలికేందుకు పలువురు ప్రజలు సిద్ధమయ్యారు. ఇంటి ముందు రంగుల ముగ్గులు వేసేందుకు పలువురు ప్రజలు వివిధ రంగులను కొనుగోలు చేయడం కనిపించింది. ప్రముఖులు, అధికారులు, శ్రేయోభిలాషులకు ఇచ్చేందుకు పూలబొకేలు పట్టణంలో సిద్ధమయ్యాయి. కేక్‌లు, స్వీట్ల దుకాణాలతో పాటు మందు షాపుల వద్ద రద్దీ అధికంగా కనిపించింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ, రూరల్ సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణల ఆధ్వర్యంలో పట్టణం, మండలంలో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చిల్లర వర్తకుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

- మున్సిపల్ ఆఫీసువద్ద సీఐటీయూ నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తోపుడు బండ్ల వర్తకులు, చిల్లర వ్యాపారులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో అనేక సంవత్సరాలుగా పండ్లు, కూరగాయలు, నూడిల్స్, పానీపూరీ వంటి తిను బండారాలను అమ్ముకుంటూ వందలాది మంది జీవనం సాగిస్తున్నారు. వారిని రోడ్లపై వ్యాపారాలు చేసుకునేందుకు వీల్లేదంటూ పోలీసులు గడిచిన రెండు నెలలుగా చేస్తున్న నిర్బంధానికి వ్యతిరేకంగా మంగళవారం కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, బీవీ రమణ, వి.ఇందిర, బంకురు సూరిబాబు తదితరులు మాట్లాడుతూ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గడిచిన రెండు నెలలుగా చిల్లర వర్తకులను వ్యాపారాలు చేయనివ్వడం లేదన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్, ఏఎస్పీ మున్సిపల్ కమిషనర్ తదితరులకు అనేక దఫాలుగా తెలియజేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమైన రహదారిలోనే బజారు ఉండడం అనేది ఈ పార్వతీపురం పట్టణం ప్రత్యేకత అని, దీనివల్ల చిల్లర వర్తకులను పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని, వ్యాపారం చేయకుండా అడ్డుకుంటూ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్వతీపురం పట్టణంలో సుమారు 200 మంది తోపుడుబండ్లపై చిల్లర వర్తకం చేసుకుని జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారిపై ఈ రకమైన ధోరణికి పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంచాన ఉమామహేశ్వరరావు, పాకల సన్యాసిరావు సీఐటీయూ నాయకులు రెడ్డి వేణు, చిల్లర వర్తకుల సంఘం నాయకులు అప్పలరాజు, సుధాకర్, వెంకన్న, రాజు, రోహిణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రహదారిపై అంటిపేట వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు



రోడ్డుకు ఇరువైపులా ఉన్న బియ్యం లోడ్ లారీలను తప్పించి వెళ్తున్న వాహనాలు

సీతానగరం: మండలంలో నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడే రాష్ట్ర రహదారిలో అంటి పేట వద్ద వేర్‌హౌస్ గోదాంకు వచ్చిన బియ్యం లోడ్ లారీలు రోడ్డుకు ఇరువైపులా రోజుల తరబడి నిలిచి పోవడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడుతోందని ప్రయాణికులు అంటున్నారు. మంగళవారం సాయంత్రం అంటి పేట-లచ్చయ్య పేటగ్రామాల మధ్య ఉన్న వేర్‌హౌస్ గోదాంకు జిల్లాలోని పలుమిల్లుల నుంచి వచ్చిన బియ్యం లోడు లారీలు నిలిపి వేసిన సమయంలో కార్లు, ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించడానికి గంటల సమయం పడుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బియ్యం లోడులను యార్డ్‌లోకి మళ్లించి రాకపోకల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి



పింఛన్ సొమ్ములు అందిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: పట్టణంలోని 19,20వ వార్డుల్లో పింఛన్లను స్త్రీశిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం పంపిణీ చేశారు. ఫించనుదార్లు కళ్లల్లో కాంతులు నింపడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఈ సందర్భంగా మంత్రి అన్నారు. పట్టణంలో ఈ నెల నూతనంగా 20 వితంతు పింఛన్లు, 6 వివిధ రకాల పింఛన్లు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

తప్పులు సరి చేసుకునేందుకు సమయం ఇవ్వాలి

విజయనగరం ఫోర్ట్: గ్రామ, వార్డు సచివాలయాల్లో కులగణన జనాభా లెక్కలలో అనేక సమస్యలు, తప్పులు ఉండటం వలన వాటిని సరి చేసుకోవడానికి తగు సమయం ఇవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు శ్రీను మాదిగ కోరారు. ఈ మేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలో ప్రదర్శిస్తున్నటువంటి కులగణనలో కుటుంబంలో అన్ని పేర్లు ఉండడం లేదన్నారు. కొన్ని సచివాలయాల్లో 70 సంవత్సరాల నుంచి మాదిగ హిందువులుగా పిలవబడుతున్నటువంటి వాళ్లు ఇప్పుడు మాదిగ క్రైస్తవులుగా పేర్కొన్నారని తెలిపారు. తండ్రి పేరు ఒకే కులంలోనూ పిల్లల పేర్లు మరో కులంలోనూ ఉన్నాయని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఇజ్రాయిల్ తదితరులు ఉన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత ప్రదర్శన కళాకారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి గ్రామంలో రక్తహీనత నివారణపై కళాజాత ప్రదర్శన ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.శంకర్, ఎం.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా అనేది ఒక జన్యుపరమైన వ్యాధి అని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి చేసే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయని, సాధారణ రక్తకణాల కన్నా సికిల్ సెల్స్(కణాలు) మందంగా ఉన్నప్పుడు శరీరంలోని అవయవాలకు రక్తం సరఫరా సక్రమంగా జరగదని, ఆ సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందన్నారు.

సమ్మె తాత్కాలిక విరమణ



నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేస్తున్న జేఏసీ నాయకులు

సీతంపేట: గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు గత 45 రోజులుగా ఐటీడీఏ ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్న వారికి గిరిజన జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్టు అవుట్‌సోర్సింగ్ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, కె.కృష్ణారావు, ఎస్.మోహన్‌రావు, కె.భవాని, బాలరాజు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విజయ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు



బాధితురాలితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

పాలకొండ రూరల్: ఎన్నడూ లేని విధంగా పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలు పాలకొండలో ఆరోగ్యశ్రీ ద్వారా జరగడం మంచి పరిణామంగా విజయ ఆస్పత్రి నిర్వాహకులు దూబ పద్మావతి అన్నారు. పాలకొండ విజయ ఆస్పత్రిలో ఇటీవల పెద్ద బుడ్డిడి గ్రామానికి చెందిన కర్రి సీతమ్మకు వెన్నుపూస ఆపరేషన్ విజయవంతగా నిర్వహించినట్లు తెలిపారు. మంగళవారం ఆపరేషన్ చేయించుకున్న బాధితురాలితో కలసి వైద్యులు మీడియా సమావేశం నిర్వహించారు. సీతమ్మ వెన్నులో పూసలు క్రమం తప్పడంతో ఆమె పూర్తిగా నడవలేక మంచానికి పరిమితం అయినట్లు ఆర్థోపెడీషియన్ హితీష్ అక్షయరాజు అన్నారు. ఈ క్రమంలో నలుగురు వైద్యుల బృందం తమ ఆస్పత్రిలో దాదాపుగా 6 గంటలు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు. ప్రస్తుతం బాధితురాలు స్వతహాగా నడవగలుగుతున్నట్లు తెలిపారు. గతంలో మాదిరి ఆపరేషన్లు, ఇతర వైద్యపరమైన సమస్యలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. హెల్త్ కార్డులు కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్యులు శరత్‌చంద్ర, సంపత్‌కుమార్, అనుపమ, మేనేజర్ ధర్మారావు పాల్గొన్నారు.

రెవెన్యూసదస్సులను రైతులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని భూముల సమస్యలు పరిష్కరించడానికి గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రసన్న కుమార్ అన్నారు. ఈ మేరకు కొత్తవలసలో తహసీల్దార్ ప్రసన్నకుమార్ మండల సర్వేయర్‌తో కలిసి మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి పరిష్కరించాలనే సంకల్పంతో రైతుల సమస్యలు స్థానికంగానే పరిష్కరించాలని మార్గదర్శకాలు విడుదల చేయడం వల్ల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, భూముల సమస్యల పేరుతో ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంకితభావంతో రోగులకు సేవలందించాలి

- డీఎంఓ డా.టి.జగన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

సీతానగరం: వైద్యసేవలు అందించే క్రమంలో అంకితభావం, సేవాదృక్పథంతో అధికార సిబ్బంది సేవలందించాలని, పనితీరే ప్రామాణికమని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. తనవిధి నిర్వహణలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. పలుగ్రామాల నుంచి రోగులు ఆస్పత్రికి వచ్చే సమయంలో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, అందజేస్తున్న చికిత్స వివరాలు పరిశీలించారు. ప్రధాన రహదారికి సమీపాన పీహెచ్‌సీ ఉన్నందున అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లు, మందులు, వైద్య పరికరాల లభ్యతను అడిగి తెలుసు కున్నారు. అక్కడ రోగులతో మాట్లాడి ఆరోగ్యసమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో డాక్టర్ జగన్‌మోహన్‌రావు ఆరోగ్య కార్యక్రమాలు, అందిస్తున్న సేవలుపై సమీక్ష చేశారు. ముందస్తు ప్రణాళికతో ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించినప్పుడే రోగాలు మటుమాయమవుతాయన్నారు. వైద్యులకు గుర్తింపు వస్తుందన్నారు. అలాగే శాఖల మధ్య సమన్వయంతో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు అందుబాటులో ఉన్న అన్ని ఉచిత వైద్యసేలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో రోగులకు ప్రయాస తగ్గుతుందన్నారు. గ్రామాలవారీగా ఆరోగ్యనివేదికలు ఎప్పటి కప్పుడు పరిశీలించి పురోగతికి కృషి చేయాలని సూచించారు. అనారోగ్య సమస్యలు గుర్తించిన వారి ఆరోగ్యం మెరుగుపడేవరకు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ముఖ్యంగా రక్తహీనత, మాతా శిశు ఆరోగ్యం, కిశోరీ బాలికలు, దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజారోగ్యం దృష్ట్యా అందజేస్తున్న వైద్య సేవలవిషయంలో అంకితభావంతో సేవలందించినప్పుడే వృత్తిలో సంతృప్తి ఉంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.పావని, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి ఇ.రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా మున్సిపల్ సర్వసభ్యసమావేశం

- ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం



జరుగుతున్న మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ప్రజారోగ్యవిభాగంలో ట్రాక్టర్, జేసీబీ, కాంపాక్టర్, సెప్టిక్‌క్లీనర్‌ల నిర్వహణకు ఐదుగురు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్‌లను భర్తీ చేయాలని ప్రతిపాదించగా మళ్లీ కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరక వాయిదా పడింది. పట్టణంలో 34 సామాజిక మరుగుదొడ్ల ఏడాది నిర్వహణకు సంబంధించిన టెండర్లపై వైస్‌ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు మండిపడ్డారు. గడిచిన 8 నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకుండా టెండర్లు ఎలా పిలుస్తారని ప్రశ్నించగా, ఆయనకు కౌన్సిలర్లు గిరిరఘు, వెంకటరమణలు మద్దతు పలికారు. దళితులైన పారిశుద్ధ్య కార్మికులకు 8 నెలలుగా జీతాలు చెల్లింపు చేయకపోతే వారు ఎలా బతుకుతారని కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. అనంతరం 2024-25 సవరించిన బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలి



పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పీజీఆర్ఎస్‌లో వినతులను అందించేందుకు వచ్చిన అర్జీదారుల పట్ల సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ రిసెప్షన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ రిసెప్షన్ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. అర్జీదారులకు తాగునీరు, టీ తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై పటిష్టమైన ఆడిట్, శాఖాధికారుల బాధ్యతపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను ప్రతిరోజూ కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్య కార్యాలయంలో అందజేయవచ్చని స్పష్టం చేశారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏపీటీఎఫ్ నాయకులు

బలిజిపేట:

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీటీఎఫ్ శాఖ మంగళవారం ఆవిష్కరించింది. ఈ మేరకు వెంగాపురం ప్రాథమిక పాఠశాల వద్ద నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర కార్యదర్శి పి.ధనుంజయరావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు బలరాంనాయుడులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధి మరింతగా జరిగి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్ కీపర్లపై కక్ష సాధింపు ఎందుకు?

- మండల సర్వసభ్య సమావేశంలో వెలుగు ఏపీఎం తీరుపై సభ్యుల మండిపాటు



ఏపీఎం అన్నపూర్ణను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరావు, చంద్రరావు

రామభద్రపురం:

చిరుద్యోగులైన బుక్ కీపర్లపై కక్ష సాధింపు చర్యలెందుకని, వారిని తొలగించేందుకు ఎందుకు ఆసక్తి చూపిస్తున్నారని టీడీపీ రామభద్రపురం ఎంపీటీసీ-2, 3లు వసంతల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్రరావులు వెలుగు ఏపీఎంను ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఏపీఎం కె.అన్నపూర్ణ నివేదికలు వెల్లడిస్తుండగా, వారు జోక్యం చేసుకుని, తమ దృష్టికి తీసుకురాకుండా బుక్ కీపర్ల తొలగింపు నిర్ణయం తీసుకోవద్దన్నారు. ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి నివేదికలు వెల్లడిస్తుండగా ఎంపీటీసీ వసంతుల తిరుపతిరావు, రొంపల్లి ఎంపీటీసీ బవిరెడ్డి శంకరరావులు లేచి, అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదని, ఉదయం 11 గంటలకు కేంద్రాలు తెరుస్తున్నారని ఆరోపించారు. పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ నివేదికలు చదువుతుండగా, మామిడివలస టీడీపీ ఎంపీటీసీ మండక తిరుపతినాయుడు లేచి మామిడివలస, నరసాపురంలలో నెలల తరబడి తాగునీరు లేదని, గత మూడు సమావేశాల్లో చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదెందుకని నిలదీశారు. ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ నివేదికలు చదువుతుండగా ఎంపీటీసీ బవిరెడ్డి చంద్రరావు లేచి స్థానిక కనిమెరక వీధిలో శిథిలావస్థలోని మూడు విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రణయ మాట్లాడుతుండగా ఎంపీటీసీ తిరుపతినాయుడు లేచి బూసాయవలస, రామభద్రపురం హైస్కూల్ వద్ద ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించాలని ఆర్టీసీ అధికారి మల్లికేశ్వరరావు అభ్యర్థించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు వెంట వెంటనే చెల్లించాలని అడిగారు. మండలంలో ఇటీవల తుపాను వర్షాలకు 267 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని ఏవో వెంకటయ్య తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధి చర్యలపై కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాలన్నారు. సమావేశంలో తహసీల్దారు ఎ.సులోచనరాణి, వైద్యాధికారులు దిలీప్‌కుమార్, రత్నదీపక్, హౌసింగ్ డీఈఈ అప్పయ్య, ఇరిగేషన్ ఏఈ వేంకటేష్, హెచ్‌వో మోహనకృష్ణ, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.